క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన విద్యుత్ శాఖ ఈఈ


ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈఈ బభ్రువాహన

ఎమ్మిగనూరుటౌన్: కొత్తగా ఏర్పాటైన ఎమ్మిగనూరు విద్యుత్ శాఖ సబ్‌డివిజన్‌కు నియామకమైన ఈఈ బభ్రువాహన సోమవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఈఈకి సూచించారు. డీఈ రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

మద్దికెర: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సర్పంచ్ మల్లికార్జున, మహిళా సాధికార సంస్థ రీజనల్ కో–ఆర్డినేటర్ షణ్ముఖ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలకు కనీస వయసు 18 ఏళ్లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులు, పురోహితుల పై కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల రక్తహీనతతో ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని పుట్టబోయే పిల్లలకు వ్యాధినిరోధక శక్తి ఉండదన్నారు. ఏపీఎం మధుబాబు, ఈఓ సుధాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

హనుమ విగ్రహం విరాళం


మూలవిరాట్టు విగ్రహాన్ని అందిస్తున్న దాత వడ్డె చిరంజీవి

వెల్దుర్తి: స్థానిక హైవే –44 పక్కన ఏర్పాటవుతున్న 51 అడుగుల భారీ అభయాంజనేయ స్వామి విగ్రహం చెంత నిర్మితమౌతున్న ఆలయానికి రూ.2 లక్షల విలువైన ఆంజనేయ స్వామి మూల విరాట్టు విగ్రహాన్ని పట్టణానికి చెందిన తమ్మిశెట్టి వడ్డె చిరంజీవి విరాళంగా అందించారు. ఈ మేరకు సోమవారం విగ్రహాన్ని ఆలయ నిర్వాహకులు చెరుకులపాడు రామాంజనేయులుకు అందించారు. దాత మాట్లాడుతూ స్వామి వారి మూలవిరాట్టు విగ్రహాన్ని తమిళ నాడు రాష్ట్రం తిరుపూర్ నుంచి తెప్పించినట్లు తెలిపారు. ధార్మిక ప్రమాణాలు పాటిస్తూ కృష్ణశిలతో విగ్రహాన్ని తయారు చేయించినట్లు చెప్పారు. ఆధ్యాత్మిక వేత్త లక్ష్మిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

దేవనకొండ: మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మార్వో వెంకటేష్‌నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పైపెచ్చులు ఊడి పడుతుండేవని చెప్పారు. జిల్లా అధికారులకు ఈ విషయాన్ని తెలపగా ఖాళీగా ఉన్న పొదుపు భవనంలో తహసీల్దార్ కార్యాలయం భవనంగా మార్చుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. ఇందులో భాగంగానే తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. సోమవారం నుంచి రెవెన్యూ సేవలన్నీ ఈ భవనం నుంచే చేపడతామని, ప్రజలు గమనించాలని కోరారు.

ఈవ్‌టీజింగ్‌ను అరికట్టాలి

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఈవ్‌టీజింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు. ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అన్న చేతిలో తమ్ముడి హతం


మృతి చెందిన చిన్నఆనంద్

కృష్ణగిరి: పనికి వెళ్లడం లేదని అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడు మృతి చెందిన ఘటన కృష్ణగిరి మండల పరిధిలోని టి.గోకులపాడులో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జరదొడ్డి యేసయ్య, అనురాధ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పెద్ద ఆనంద్ వెల్దుర్తిలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. రోజూ ఇంటి నుంచి వెళ్లి తిరిగివచ్చేవాడు. చిన్న కుమారుడు చిన్న ఆనంద్ (21) గ్రామంలో అప్పుడప్పుడు పనికి వెళ్లేవాడు. సోమవారం రాత్రి అన్న పనికి ఎందుకు వెళ్లడం లేదని తమ్ముడిని ప్రశ్నించగా మాట మాట పెరిగింది. ఆగ్రహంతో తమ్ముడి గొంతు నొక్కి పట్టుకోవడంతో ఊపిరి అందక కుప్పకూలిపోయాడు. ఇరుగుపొరుగు వారు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చిన్న ఆనంద్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సురేష్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సామాన్యుడికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం

వెల్దుర్తి: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమవుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం–3 పరిధి ఎంపీపీ స్కూల్‌లో ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలతో మమేకమై వారి ఆరోగ్య పరిస్థితులపై వాకబు చేశారు. ఓపీ సేవలు, అవగాహన కార్యక్రమాలు, బీపీ, షుగర్, హెచ్‌బీ, ఈసీజీ, కంటి పరీక్షలు, మందుల పంపిణీ, పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కంటి అద్దాలు, హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ పాలన సాగిస్తున్నాడన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న తపనతో ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహింపజేసి, హెల్త్ క్యాంప్‌లద్వారా వైద్యం అందేలా, ఉచితంగా మందులనిస్తూ, ఎన్నో ఆరోగ్య పథకాల ద్వారా సేవలందిస్తున్నాడన్నారు. శిబిరంలో 410 మంది వైద్య సేవలందుకున్నట్లు సీహెచ్‌ఓ సత్యనారాయణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, బొమ్మన పెద్దిరెడ్డి, అగస్టీన్, దేవమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


వెల్దుర్తిలో ఈసీజీ పరీక్షను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఆలూరు రూరల్: సామాన్యుడికి సైతం కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని ఆలూరు సచివాలయం–2లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి ఆధ్వర్యంలో స్పెషలిస్టు డాక్టర్లు శాంతి, గుల్నాజ్, శివకుమార్ 545 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు రోగులను కర్నూలు విశ్వభారతి ఆస్పత్రికి రెఫర్ చేశారు. కంటి వైద్యురాలు ఝాన్సీ 50 మందికి పరీక్షలు చేసి 40 మందికి కళ్లద్దాలు అవసరమని, మరో 10 మందికి కంటి ఆపరేషన్ కోసం కర్నూలు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో సోమవారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ శిబిరాన్ని పర్యవేక్షించారు. డాక్టర్లు వైద్య సేవలందించి మందులను పంపిణీ చేశారు. పలువురికి కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలను అందించారు. ఎంఈవో ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుగ్గలి: ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగనమోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని సర్పంచ్ ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం ఉప్పర్లపల్లిలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి స్థానిక వైద్యులతో పాటు, స్పెషలిస్టు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ అందజేశారు.

గోనెగండ్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్లు రవళి, కార్తీక్, రుక్సానా 305 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ హైమవతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మా కాలనీకే వచ్చి వైద్యం చేస్తున్నారు



వారం రోజుల కింద మా ఇంటికి నర్సులు వచ్చి నాకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సోమవారం కాలనీలోని సచివాలయానికి పెద్ద డాక్టర్లు వస్తారు. నీకు మందులు ఇస్తారని చెప్పి టోకెన్ ఇచ్చారు. నాకు చాలా రోజుల నుంచి విపరీతమైన దగ్గు ఉండడంతో గళ్ల పరీక్ష చేశారు. మరో పరీక్ష చేయించుకోవాలని ఆలూరు ఆస్పత్రికి వెళ్లాలని మందుల చీటీ రాసి ఇచ్చారు. ఇన్ని రోజులుగా నాకు ఈ వ్యాధి ఉందని తెలియదు. ఈ వైద్య శిబిరం ద్వారా నాకు మంచి జరిగింది. నాకు ఇచ్చిన మందులు వాడితే నయం అవుతుందన్నారు. పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి శ్రద్ధ చూపుతున్నారు. – ఈరన్న, కోయనగర్ కాలనీ

● ప్రతి రోగికి వైద్యం అందాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్ష పథకం కింద ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య అన్నారు. సోమవారం ఆలూరు సచివాలయం –2లో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై వైద్యులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ అల్లబకష్, కో–ఆప్షన్ మెంబర్ బాషా, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆలూరు హెల్త్ క్యాంపులో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య


ఉప్పర్లపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్


కలుగోట్లలోని బీపీ పరీక్షలు చేస్తున్న సిబ్బంది


గోనెగండ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


వెల్దుర్తి హెల్త్ క్యాంప్‌లో ఓపీ నమోదు చేస్తున్న దృశ్యం


ఆలూరులో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన


ఎమ్మిగనూరులోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: జగనన్న చేదోడు పథకం నాల్గవ విడత ఆర్థిక సాయం మంజూరు చేసేందుకు ఈ నెల 19వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరుకు రానుండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పరిశీలించారు. స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఏర్పాటు చేయనున్న సభా స్థలిని పరిశీలించి అక్కడ ఎంత మంది కూర్చునేందుకు వీలుంటుందని, బ్యారికేడ్ల ఏర్పా ట్లను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సభ ప్రాంగణంలో ప్రవేశ మార్గంతో పాటు స్టేజీ ఏర్పాటు, వెంకటాపురం స్పిన్నింగ్ మిల్ వద్ద హెలిప్యాడ్ నిర్మాణం, బ్యారికేడ్ల ఏర్పాటును ఎమ్మెల్యే పరిశీలించి పలు అంశాలపై ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్లు రఘునాథ్‌రెడ్డి, గంగిరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. రోడ్‌షో ప్రాంతాన్ని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ మండల, పట్టణాధ్యక్షులు బీఆర్ బసిరెడ్డి, బుట్టారంగయ్య, నాయకులు భీమిరెడ్డి, కౌన్సిలర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఏమ్మిగనూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేసేందుకు వార్డు సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం తన నివాసంలో పట్టణంలోని వార్డు సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. సీఎం సభ విజయవంతం చేయడంపై పలు సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, జేసీఎస్ పట్టణ కన్వీనర్లు షబ్బీర్‌అహమ్మద్ బంగిశ్రీరాం, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

చంద్రబాబు నోరువిప్పాలి

ఎమ్మిగనూరుటౌన్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నోరు విప్పి నిజం చెప్పాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ చంద్రబాబు, టీడీపీ, జనసేన నాయకులు ఎక్కడా స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో జరిగిన అవినీతి గురించి ప్రస్తావించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దోచుకున్న సొమ్ము గురించి చెప్పకుండా 17ఏ నిబంధనను అడ్డుపెట్టుకొని కేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రూ.371 కోట్ల ప్రజల సొమ్మును షెల్ కంపెనీల ద్వారా దోచుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. అవినీతిపై పక్కా ఆధారాలను దర్యాప్తు సంస్థలు కోర్టులో సమర్పించడంతోనే న్యాయస్థానం చంద్రబాబును రిమాండ్‌కు పంపిందన్నారు. అరెస్ట్‌పై ప్రజల్లో సానుభూతి వస్తుందనే భ్రమలో టీడీపీ శ్రేణులు ఉన్నారని, స్కిల్ స్కామ్‌లో అవినీతిని గుర్తించిన ప్రజలు చంద్రబాబును నమ్మడం లేదన్నారు. జనసేన పవన్‌కళ్యాణ్ ఎమ్మెల్యేగా గెలవడమే కష్టమని అలాంటిది సీఎం వైఎస్ జగన్‌నే ఢీకొంటామని ప్రగల్భాలు పలుకుతుండడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజాసంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి జనరంజక పాలన సాగిస్తున్న సీఎం జగనన్న సారథ్యంలో వైఎస్సార్‌సీపీ రానున్న ఎన్నికల్లో మొత్తం 175 అసెంబ్లీ స్థానాలు గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఇంటింటికీ కుళాయి పనులకు శ్రీకారం

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో ఇంటింటికీ కుళాయి పనులకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం శ్రీకారం చుట్టారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.1.16 కోట్లతో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులలో భాగంగా 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టరును ఆదేశించారు. ముందుగా స్థానిక మారెమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో తమ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి కృషిచేసిన దివంగత నారాయణ రెడ్డికి, ప్రస్తుతం ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటుతో పాటు సమస్యల పరిష్కారంలో ముందున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాన్, ఏఈఈ మునెయ్య, వైస్ ఎంపీపీ గోవర్ధనగిరి రంగయ్య, సర్పంచ్ ఎల్లరాముడు, రంగారెడ్డి, కాంతారెడ్డి, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.


గోవర్ధనగిరిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

టీబీ డ్యాంలో 45 టీఎంసీల నీరు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ సోమవారం 45 టీఎంసీలకు తగ్గింది. 1613.50 అడుగుల వద్ద నీటి మట్టం ఉండగా ఇన్‌ఫ్లో 749, ఔట్‌ఫ్లో 9,358 క్యూసెక్కులుంది. కాలువకు వదులుతున్న నీటితో పాటు ఆవిరి రూపంలో వారానికి 6 టీఎంసీల నీరు ఖర్చయ్యాయి. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 493 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. గతేడాది ఇదే సమయానికి డ్యాం పూర్తి సామర్థ్యం 1633 అడుగులతో 105.788 టీఎంసీల నీరు నిల్వ ఉండేవి. ఈ ఏడాది వర్షాభావం కారణంగా డ్యాం నిండకపోగా రోజురోజుకు నీటిమట్టం వేగంగా తగ్గుతోంది.


తుంగభద్ర జలాశయం

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

కృష్ణగిరి: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని జోన్ ఆపరేషన్ డీఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. మంగళవారం టెక్నికల్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్‌ను పరీక్షించనున్నట్లు తెలిపారు. కంబాలపాడు, లక్కసాగరం సబ్‌స్టేషన్ల నుంచి ఇక్కడికి సరఫరా తీసుకునేలా పనులు పూర్తి చేశామన్నారు. సబ్‌స్టేషన్ పనులు పూర్తి కావడంతో గ్రామంతోపాటు కోయిలకొండ, పెద్దొడ్డి, ఆలంకొండ, లాన్‌మాన్ పల్లె, చుంచుఎర్రగుడి తదితర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలియజేశారు. ఏడీ రమణారావు, ఏఈ మద్దిలేటి వెంట ఉన్నారు.


చిట్యాలలో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

పనిభారం తగ్గించాలి

ఎమ్మిగనూరురూరల్: ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని ఏపీ ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ముందు ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. పనిభారం పెరిగిపోయి ఆశా వర్కర్లు ఒత్తిడికి గరౌతున్నారని, అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు.

సైన్స్ ల్యాబ్ ఏర్పాటు

ఎమ్మిగనూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు ముంబైకి చెందిన యునైటెడ్ వే ప్రగతి సంస్థ రూ.7.5 లక్షలు మంజూరు చేసింది. బాలిక విద్యను ప్రోత్సహిస్తూ, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, సైన్స్ టెంపర్‌మెంట్, సబ్జెక్టుల పట్ల ఆసక్తిని పెంచేందుకు సైన్స్ ల్యాబ్ దోహదపడుతోందని ఆ సంస్థ ప్రతినిధి స్వరూపరాణి పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రగతి సెంటర్‌ను కూడా గాంధీనగర్‌లో ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 12 –18 ఏళ్ల వయస్సు గల బాలికలు ఈ సెంటర్‌లో సైన్స్, మ్యాథ్స్, లైఫ్ స్కిల్‌లో ఉచితంగా శిక్షణ పొందవచ్చన్నారు. శిక్షణ కాలంలో అర్హులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా మంజూరు చేస్తారని తెలిపారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరు జెడ్పీ పాఠశాల సిబ్బందితో ప్రగతి సంస్థ ప్రతినిధులు

స్పందనతో సమస్యల పరిష్కారం

చిప్పగిరి: స్పందన కార్యక్రమంలో సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు లక్ష్మినారాయణ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వినతులు పరిశీలించి తగిన పరిష్కారాలు చూపుతామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ బాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


బి.మాధవి

ఆలూరు: స్థానిక హత్తిబెళగళ్ గ్రామ రోడ్డు సమీపంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.మాధవి ఈ నెల 12న కర్నూల్లో జరిగిన టెన్నికాయిట్ క్రీడలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్కూల్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ అథారిటీ సెలక్షన్ కమిటీ సభ్యులు ఆమెను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అదేవిధంగా ఈ పాఠశాల నుంచి పి.రేణుక వాలీబాల్, శాంతిబాయ్ హ్యాండ్‌బాల్, శ్రీలత ఖోఖోలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షాహనూరు సోమవారం తెలిపారు. వీరందరూ వచ్చే నెలలో ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

బీమా తక్షణ సాయం అందజేత

మద్దికెర: వైఎస్సార్ బీమా వరంలాంటిదని ప్రతిఒక్కరూ వైఎస్సార్ బీమా చేయించుకోవాలని ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, సర్పంచ్ సుహాసిని అన్నారు. మద్దికెరలో ఎరవల్లి గోపి అనే వ్యక్తి 12వ తేదీన మృతి చెందాడు. మృతుడి పేరిట వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో సోమవారం ఆయన భార్య మాధవికి తక్షణసాయం కింద రూ.10 వేలు అందించారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

సరుకులు సకాలంలో అందించాలి

మద్దికెర: అంగన్‌వాడీ సెంటర్లకు ఎండీయూ ఆపరేటర్లు సకాలంలో సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు పద్మ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండీయూ ఆపరేటర్లు సకాలంలో వేలిముద్రలు వేయించుకోకుండా సరుకులు అందించకుండా మీరే వచ్చి తీసుకెళ్లాలని అంటున్నారన్నారు.అధికారులు స్పందించి సరుకులు సకాలంలో అందించేలా చూడాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ.. సంబంధిత వారితో విచారించి కేంద్రాలకు సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుపేదలకు భూములు ఇవ్వాలి

తుగ్గలి: భూమి లేని నిరుపేదలకు రెండెకరాల చొప్పున భూమి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు శ్రీరాములు, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదు ట వారు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగరాజు పాల్గొన్నారు.

హైవే పనులు ప్రారంభించాలి

ఆలూరు: ఆదోని నియోజకవర్గం నుంచి ఆలూరు మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే- 167 పనులను త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి ఉత్సవాల నిర్వహణపై అధికారుల సమీక్ష నిర్వహించేందుకు వెళుతూ కలెక్టర్ స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకోగా సీపీఎం నాయకులు నారాయణస్వామి, షాకీర్, ఈరన్న తదితరులు వినతిపత్రం ఇచ్చారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

కృష్ణగిరి: స్పందనలో వచ్చే అర్జీలను ఆయా శాఖల అధికారులు గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె స్పందనలో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ఒకసారి వచ్చిన సమస్య మరోమారు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ పరంగా వచ్చిన సమస్యలను వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ విశ్వమోహన్, ఏఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం మహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి సత్కారం

ఎమ్మిగనూరుటౌన్: బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహించేందుకు ప్రకటించిన అవార్డుల్లో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని కె.రిజ్వానకు చోటు దక్కింది. ఇటీవల జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాల్‌లో జిల్లా కలెక్టర్ సృజన చేతుల మీదుగా రాజ్వాన మొమెంటోతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ రాణి సోమవారం తెలిపారు. విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ ఇంగ్లీష్ మీడియంలో 456/470 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

ఆరుతడి పంటలు సాగుచేసుకోండి

దేవనకొండ: హంద్రీనీవా కాలువ కింద రబీ సీజన్‌లో రైతులు దీర్ఘకాలిక పంటలను సాగుచేసుకోరాదని, ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని ఏఓ సురేష్ బాబు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. హంద్రీ – నీవాకు నవంబర్ 15వ తేదీ వరకు మాత్రమే సాగు నీరు విడుదల అవుతుందని, ఆ తర్వాత నీరు నిలిపి వేసే అవకాశం ఉందన్నారు. రైతులు గమనించి ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని సూచించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దేవనబండ గ్రామానికి వచ్చిన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు గ్రామ దళితులు సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని దళిత కాలనీకి వచ్చిన ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించి, నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చూడాలని కోరారు. ఈయన వెంట ఆర్డీఓ మోహన్‌దాస్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దారు విష్ణుప్రసాద్, తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆలూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ, ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక సచివాలయం–2లో సోమవారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడ రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు, మందులు, ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

● ఇద్దరికి తీవ్ర గాయాలు
● ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన శివప్ప

హొళగుంద: హొళగుంద శివారులోని ఆదోని రోడ్డులో సోమవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో వందవాగిలి గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వందవాగిలికి చెందిన ట్రాక్టర్‌లో సిమెంట్ బ్రిక్స్, సిమెంట్ బస్తాలు వేసుకుని హొళగుంద నుంచి వందవాగిలికి వెళ్తుండగా హొళగుంద శివారులో ట్రాక్టర్ ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. అందులో కూర్చున్న శివప్ప, పదేళ్ల బాలుడు విజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి చెయ్యి విరిగి, పండ్లు ఊడి, మొహంపై తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను హొళగుంద పీహెచ్‌సీకి తరలించగా డాక్టర్ బిందుమాధవి ప్రాథమిక చేశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోనికి రెఫర్ చేశారు.


ఆదోని రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ